RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:99 | ఏప్రిల్ 02, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## అంజన్న ఆలయంలో అపశ్రుతి

- చలువు పందిరి కూలి 15 మందికి గాయాలు
- హనుమాన్ చిన్న జయంతి వేడుకల్లో ఘటన
- నాసిరకం ఏర్పాట్లపై భక్తుల ఆగ్రహం

2లో

# ఔట్ సోర్సింగ్! గోస!

## ప్రభుత్వ యంత్రాంగానికి వెన్నుముక.. గుర్తింపు శూన్యం!


## కనీస భద్రత లేని కొలువులు.. నిరంతరం భయం.. భయం..

## చాలీచాలని వేతనం.. అంతులేని పనిభారం!

- అందని సమాన పనికి సమాన వేతనం
- ఆవిరి అవుతున్న కార్పొరేషన్ హామీ
- కరోనా కష్టాల్లోనూ భయమెరుగని సేవలు
- పీఎఫ్, ఈఎస్ఐ అమలుపై నీలినీడలు
- ప్రభుత్వం దృష్టిసారించాలంటూ వేడుకోలు
- కవితకు ఇటీవల గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- భరోసా ఇచ్చిన జాగృతి అధినేత్రి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం చక్రం సాఫీగా తిరగాలంటే వారు ఉండాల్సిందే. సచివాలయం నుంచి మారుమూల గ్రామ పంచాయతీ వరకు.. ఆఫీసు పనుల నుంచి క్షేత్రస్థాయి సేవల వరకు అన్నీ వారి భుజస్కంధాలపైనే నడుస్తున్నాయి. కానీ, వారి జీవితాలు మాత్రం దశాబ్దాలుగా చీకట్లోనే మగ్గుతున్నాయి. వారే ప్రభుత్వ పాలనలో కీలక సైనికులైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు. సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీంకోర్టు తీర్పులు కాగితాలకే పరిమితం కావడంతో, అరకొర జీతాలతో కుటుంబాలను పోషించలేక వేలాది మంది ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. అటు ఉద్యోగ భద్రత లేక, ఇటు అధికారుల ఒత్తిడికి తలవొంచి వెట్టిచాకిరీ చేస్తూ మానసిక వేదన అనుభవిస్తున్నారు. మధ్యవర్తుల దోపిడీకి చెక్ పెడుతూ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న పాలకుల హామీలు ఎప్పుడు కార్యరూపం దాల్చుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.




2లో

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం
- నేటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మక అమలు
- ఇంటినుంచే భూ సేవలు.. రైతులకు సులభతరం
- పారదర్శక వ్యవస్థతో వివాదాలకు ముగింపు దిశగా అడుగు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో

## ప్రతి నిరుపేదకు సొంత ఇల్లే లక్ష్యం

**4.50 లక్షల ఇళ్లు మంజూరు**

- గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై చర్చ



2లో

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- రూ.15 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులు పట్టివేత
- విజయవంతమైన వరంగల్ పోలీసుల ఆపరేషన్

2లో

## డిజిటల్ జనగణనకు శ్రీకారం

### తొలిసారిగా డిజిటల్ విధానంలో..



- రాష్ట్రపతి భవన్‌లో స్వీయ నమోదు కార్యక్రమం
- ఉన్నతాధికారుల సమక్షంలో ప్రక్రియ ప్రారంభం

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన-2027 కార్యక్రమానికి డిజిటల్ రూపంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో స్వీయ నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన కుటుంబ వివరాలను డిజిటల్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేశారు. ఈ ప్రక్రియలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, భారత జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా దేశంలో జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోంది. దీని ద్వారా ప్రజలు తమ వివరాలను

...మిగతా 2వ పేజీలో

## కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

**కేంద్రానికి కేటీఆర్ వినతి**

- పార్టీ ఎంపీల బృందం ద్వారా లేఖ అందజేత
- సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్



2లో

## మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ

### ఏప్రిల్, మే,జూన్ కోటా సిద్ధం



- కేంద్రం కీలక నిర్ణయం
- ఎండల తీవ్రత దృష్ట్యా ముందస్తు చర్యలు
- లబ్ధిదారులకు సౌకర్యం కల్పించడమే లక్ష్యం

**వేద న్యూస్, హైదరాబాద్**

ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు పదేపదే క్యూ కట్టాల్సిన అవసరం లేకుండా మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం

...మిగతా 2వ పేజీలో

# కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

## కేంద్రానికి కేటీఆర్ వినతి

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ లేఖను పార్టీ ఎంపీల బృందం స్వయంగా కేంద్ర మంత్రికి అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కేటీఆర్ తన లేఖలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ కారణంగా సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ డివిజన్ పరిధి 2,755 ట్రాక్ కిలోమీటర్లుగా ఉండగా, భవిష్యత్తులో ఇది 3,150 కిలోమీటర్లకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది సాధారణ పరిపాలనా పరిమితిని మించి ఉందని ఆయన వివరించారు. విజయవాడ, గుంతకల్ వంటి డివిజన్లు సుమారు 2,200 కిలోమీటర్ల పరిధి కలిగి ఉండగా, గుంటూరు డివిజన్ కేవలం 900 కిలోమీటర్లలోపే ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ అసమతుల్యత వల్ల సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారిందని, రైళ్ల రాకపోకలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తే కార్యకలాపాల వికేంద్రీకరణ జరిగి, ఉత్తర మరియు తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో రైల్వే సేవలు మెరుగుపడతాయని కేటీఆర్ తెలిపారు. ఈ డివిజన్ పరిధిలో కాజీపేట–బల్లార్షా, పెద్దపల్లి–నిజామాబాద్, కాజీపేట–ఎర్రుపాలెం, డోర్నకల్–మనుగూరు, సత్తుపల్లి మార్గాలను చేర్చాలని సూచించారు. రైల్వే శాఖ పరిశీలిస్తున్న కొన్ని మార్పులపై కూడా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్దపల్లి–నిజామాబాద్ సెక్షన్‌ను హైదరాబాద్ డివిజన్‌కు బదిలీ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భౌగోళికంగా సమీపంలో ఉండే ఈ మార్గాన్ని కాజీపేట డివిజన్‌లోనే ఉంచాలని సూచించారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌పై ఉన్న అధిక భారం కారణంగా నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని, భద్రతా పర్యవేక్షణలో కూడా సవాళ్లు ఎదురవుతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు పరిష్కారంగా కాజీపేట డివిజన్ ఏర్పాటే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

## రూ.15 లక్షల విలువైన బంగారం స్వాధీనం

**వేద న్యూస్, వరంగల్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను వరంగల్ సీసీఎస్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు రూ.15 లక్షల 20 వేల విలువగల 95 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేయబడిన వారిలో కళ్యాణ సుందరం (30), సెల్వరాజ్ (28) మధురై ప్రాంతానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు కళ్యాణ సుందరం పూల వ్యాపారం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయాన్ని వ్యసనాలకు ఖర్చు చేస్తూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. గతంలో కూడా చోరీలు, మత్తు పదార్థాల విక్రయాలు, ద్విచక్ర వాహనాల దొంగతనాల్లో పాల్గొని పలు మార్లు జైలుకు వెళ్లినట్టు సమాచారం. జైలు నుండి విడుదలైన తర్వాత సెల్ దుకాణంలో పనిచేస్తూ సెల్వరాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గత నెలలో వరంగల్‌కు చేరుకొని ముందుగా ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. అనంతరం మట్టెవాడ, సుబేదారి, హన్మకొండ, కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధుల్లో మూడు ఘటనలు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో ఒక ఘటనతో కలిపి మొత్తం ఐదు చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితులు పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు గొలుసులు అపహరించడం వీరి మోసం విధానంగా పోలీసులు తెలిపారు. ఈ కేసులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితులను గుర్తించారు. వారి కదలికలపై నిఘా పెట్టి, మట్టెవాడ నుంచి హన్మకొండ వైపు వస్తుండగా అనుమానంతో ఆపే ప్రయత్నంలో పారిపోతుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# డిజిటల్ జనగణనకు శ్రీకారం

**మొదటి పేజీ తరువాయి**

సులభంగా, త్వరితగతిన నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ డిజిటల్ విధానం ద్వారా జనగణన ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. డేటా సేకరణ, నిర్వహణలో ఖచ్చితత్వం పెరుగుతుందని భావిస్తున్నారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలక ఆధారంగా నిలుస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సరైన అంచనాలు వేయడానికి ఇది ఉపయోగపడుతుంది. డిజిటల్ జనగణన ద్వారా సమగ్ర సమాచారం సేకరించి దేశాభివృద్ధికి మార్గదర్శకంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు.


# మూడు నెలల రేషన్ ఒకేసారి

**మొదటి పేజీ తరువాయి**

ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి అందజేయనున్నారు. సాధారణ లబ్ధిదారులకు నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి మొత్తం 18 కిలోల బియ్యం ఇవ్వనున్నారు. అంత్యోదయ కార్డు ఉన్న కుటుంబాలకు నెలకు 35 కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి మొత్తం 105 కిలోల రేషన్ అందించనున్నారు. అదనంగా ఆయా నెలలకు సంబంధించిన ఇతర నిత్యావసర వస్తువులను కూడా ఒకేసారి పొందే అవకాశం కల్పించారు. గత వర్షాకాలంలో కూడా ప్రజల సౌకర్యార్థం ఇలాంటి విధానాన్ని అమలు చేసినట్లు అధికారులు గుర్తు చేశారు. ఈసారి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సాధ్యమైనంత వరకు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో రేషన్ దుకాణాలకు వెళ్లి తమ కోటాను సేకరించుకోవాలని సూచించారు. ప్రజల సౌకర్యం, ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఔట్ సోర్సింగ్! గోస!

## ప్రభుత్వ యంత్రాంగానికి వెన్నుముక.. గుర్తింపు శూన్యం!




**చాలీచాలని వేతనం..**
**అంతులేని పనిభారం!**
**అందని 'సమాన పనికి సమాన వేతనం**

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకం. సెక్రటేరియట్ నుంచి మొదలుకొని గ్రామ పంచాయతీల వరకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబ్ ఆర్డినేట్లు, డ్రైవర్లు, వాచ్ మెన్లు, స్వీపర్లు ఇలా వేలాది మంది తక్కువ వేతనాలకే సేవలందిస్తున్నారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా, కొన్ని సందర్భాల్లో వారి కంటే ఎక్కువగా పని చేస్తున్నప్పటికీ, వీరికి దక్కాల్సిన గౌరవం కానీ, కనీస గుర్తింపు కానీ లభించడం లేదు. ప్రభుత్వ పాలన సాఫీగా సాగడంలో వీరి శ్రమ ఎంతో ఉన్నా, వీరి జీవితాలు మాత్రం చీకట్లోనే మగ్గుతున్నాయి.

- **కనీస భద్రత లేని కొలువులు.. నిరంతరం భయం.. భయం..**
- **ఆవిరి అవుతున్న కార్పొరేషన్ హామీ**
- **కరోనా కష్టాల్లోనూ భయమెరుగని సేవలు**
- **పీఎఫ్, ఈఎస్ఐ అమలుపై నీలినీడలు**
- **ప్రభుత్వం దృష్టిసారించాలంటూ వేడుకోలు**
- **కవితకు ఇటీవల గోడు వెళ్లబోసుకున్న బాధితులు**
- **భరోసా ఇచ్చిన జాగృతి అధినేత్రి**

### సమాన పనికి సమాన వేతనం.. నీటి మూటలేనా?

సుప్రీంకోర్టు గతంలోనే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చారిత్రాత్మక తీర్పునిచ్చింది. అయితే, తెలంగాణలో ఇది అమలుకు నోచుకోవడం లేదు. పక్కనే కూర్చుని అదే పని చేసే రెగ్యులర్ ఉద్యోగికి లక్షల్లో జీతం ఉంటే, అదే పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి అందులో నాలుగో వంతు కూడా దక్కడం లేదు. పీఆర్సీ ప్రయోజనాలు వీరికి వర్తించకపోవడంతో, పెరిగిన ధరల యుగంలో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక వీరు నానా అవస్థలు పడుతున్నారు.

### కనీస భద్రత లేని కొలువులు..

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత అనేది మచ్చుకైనా కనిపించదు. ఏ క్షణంలో తమను ఉద్యోగం నుంచి తొలగిస్తారో అన్న భయం వీరిని నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది. కాంట్రాక్టు ఏజెన్సీల దయాదాక్షిణ్యాలపై వీరి బతుకులు ఆధారపడి ఉన్నాయి. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు పనిలో మరణించినా లేదా అనారోగ్యానికి గురైనా, ఆ కుటుంబాలను ఆదుకునే నాథుడే లేదు.

### అధిక పని భారం.. అధికారుల ఒత్తిడి!

అనేక శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై అధికారులు అదనపు ఒత్తిడి పెంచుతున్నారు. నిర్ణీత పని గంటలు.. 8 గంటలు కాకుండా, ఉదయం నుంచి రాత్రి వరకు పని చేయించుకుంటున్న సందర్భాలు కోకొల్లలు. సెలవు అడిగితే ఉద్యోగం తీసేస్తామనే బెదిరింపులు, అదనపు బాధ్యతలు మోపడం వంటివి వీరిని మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అసలు సిసలు సైనికులు వీరే అయినప్పటికీ, అధికారుల వేధింపులకు బలవుతున్నారు.



### కార్పొరేషన్ హామీ ఏమైంది?

గతంలోనూ, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని పలుమార్లు హామీలు ఇచ్చాయి. ఈ కార్పొరేషన్ వస్తే మధ్యలో ఉండే దళారీ ఏజెన్సీల వ్యవస్థ రద్దవుతుందని, జీతాలు నేరుగా ఖాతాల్లో పడతాయని ఉద్యోగులు ఆశపడ్డారు. కానీ, ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడలేదు. హామీలు కేవలం ఎన్నికల నినాదాలుగానే మిగిలిపోయాయా అని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

### నిర్లక్ష్య వైఖరి ఎందుకు?

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలు అందించిన ఈ వర్గం పట్ల ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే చర్చ జరుగుతోంది. ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలు, వీరి సమస్యల పరిష్కారం విషయానికి వచ్చేసరికి బడ్జెట్ సాకులు చెబుతున్నాయి. ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న లక్షలాది కుటుంబాల ఆకలి కేకలను పాలకులు వినాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కష్టాలను గుర్తించి, వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వేతనాల్లో వ్యత్యాసాన్ని తగ్గించి, కనీస వేతన చట్టం ప్రకారం గౌరవప్రదమైన జీతాలు అందించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

### భరోసా ఇచ్చిన జాగృతి అధినేత్రి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధులు ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామని, క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న వేతన అసమానతలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి ప్రధాన సమస్యలను ఆమెకు సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యంగా అధికారుల నుంచి ఎదురవుతున్న పని ఒత్తిడి, అదనపు పని గంటల వేధింపుల గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న కవిత.. సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్గాలకు అన్యాయం జరగకుండా, వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా అడుగులు వేస్తామని ఆమె ఈ సందర్భంగా పటిష్టమైన హామీని ఇచ్చారు.

# ప్రతి నిరుపేదకు సొంత ఇల్లే లక్ష్యం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్ర అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సభలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, సొంత స్థలం కలిగిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, అన్ని నియోజకవర్గాల్లో అర్హులైన వారికి కేటాయిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఆయా నియోజకవర్గాలకు అదనంగా 1000 ఇళ్లను మంజూరు చేసినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు మొత్తం రూ. 22,500 కోట్లు వెచ్చించనున్నట్లు సభలో వెల్లడించారు. ఇప్పటికే రూ. 5,073.84 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో గృహ నిర్మాణ శాఖకు రూ. 7,430 కోట్లను కేటాయించినట్లు వివరించారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడం వారి ఆత్మగౌరవానికి చిహ్నమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు స్థిర నివాసాన్ని పొందుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గృహహీనత సమస్యను పూర్తిగా తొలగించడమే ప్రభుత్వ సంకల్పమని అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు.

# అంజన్న ఆలయంలో అపశ్రుతి

**వేద న్యూస్, కొండగట్టు**

**చలువు పందిరి కూలి 15 మందికి గాయాలు**

- **హనుమాన్ చిన్న జయంతి వేడుకల్లో ఘటన**
- **నాసిరకం ఏర్పాట్లపై భక్తుల ఆగ్రహం**
- **భద్రతా చర్యలపై ప్రశ్నలు వెల్లువ**

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిరి అకస్మాత్తుగా కూలిపోవడంతో కనీసం 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ ఉన్న భక్తుల్లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల కోసం పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. హనుమాన్ మాల విరమణ కోసం వేలాదిగా వచ్చిన భక్తుల రద్దీ మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, చలువ పందిళ్లు వంటి ఏర్పాట్లు చేసినప్పటికీ, పందిరి నాసిరకంగా ఏర్పాటు చేయడంతోనే కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వేసిన ఈ పందిరి భద్రతా ప్రమాణాలను పాటించలేదని వారు విమర్శిస్తున్నారు. పందిరి కూలిపోవడంతో గాయపడిన భక్తులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం. వైద్యులు వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆక్షేపిస్తున్నారు. ఆలయ నిర్వహణలో లోపాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే అభ్యర్థనలు వినిపిస్తున్నాయి.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం

**వేద న్యూస్, హైదరాబాద్**



రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమీకృత భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూమి, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్‌ను ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో మొదటిగా ఈ వ్యవస్థ అమల్లోకి రానుంది. ఈ ప్రయోగ ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పోర్టల్ ద్వారా రైతులు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే భూ సేవలను పొందగలుగుతారు. రైతు లాగిన్ అయిన వెంటనే తన భూమికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. సర్వే అవసరం ఉంటే దానికి సంబంధించిన ఫీజు వివరాలు కూడా స్పష్టంగా తెలుస్తాయి. ఫీజు చెల్లించిన వెంటనే దరఖాస్తు సంబంధిత సర్వేయర్‌కు చేరుతుంది. తర్వాత రెండు రోజులలో పొరుగు భూమి యజమానులకు నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోపు సర్వే తేదీని నిర్ణయిస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్ పరికరాల ద్వారా సర్వే పూర్తి చేసి వివరాలను వ్యవస్థలో నమోదు చేస్తారు. అనంతరం మండల సర్వేయర్ పరిశీలన, తహసీల్దార్ ఆమోదం తర్వాత రైతుకు ఎల్‌పీఎం, భూధార్ నంబర్లు కేటాయిస్తారు. సర్వే పూర్తయ్యాక మ్యాప్‌ను రూపొందించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి దశలో రైతుల మొబైల్ నంబర్‌కు సమాచార సందేశాలు పంపుతూ పారదర్శకతను నిర్ధారిస్తారు. భూమి కొనుగోలు, అమ్మకాల సమయంలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేయడం ద్వారా భవిష్యత్తులో వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పాత విధానాల్లో ఉన్న గొలుసులు, కొలత కర్రలు వంటి పరికరాలకు బదులుగా ఆధునిక రోవర్ పరికరాలను ఉపయోగించడం వల్ల సర్వే ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు తెలిపారు. కచ్చితత్వం పెరగడంతో రైతులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 02, 2026

# అధైర్య పడొద్దు..కాంగ్రెస్ అండగా ఉంటుంది

## - వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 34వ డివిజన్ శివనగర్ కు చెందిన విద్య మారి ప్రశాంత్ నాయి బ్రాహ్మణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ వారి కుటుంబ సభ్యుల్ని కలిసి ఓదార్చే ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు.అలాగే కొంత ఆర్థిక సాయం చేసి వారికి అండగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ నిలిచారు.

# వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ




**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్, ఎంఆర్ కరీంనగర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెంజర్ల రాంప్రసాద్ - పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కరీంనగర్ హౌసింగ్ బోర్డ్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమానికి అవసరమైన మిక్సర్ గ్రైండర్‌ను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు చిట్టుమల్ల సత్యనారాయణ, కోశాధికారి పైడ రవి, గౌరవ సభ్యులు కొడిత్యాల శివానందం, బోనగిరి రామచంద్రం, కేశెట్టి నాగరాజు, వొజ్జల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# డేంజర్ రింగ్ రోడ్!

## - గోడ కూలిపోవడంతో ప్రమాదాల ముప్పు
## - లైట్లు, హెచ్చరిక బోర్డులు లేక తరచూ యాక్సిడెంట్లు

**వేద న్యూస్, బోయినిపల్లి :**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలోని రింగ్ రోడ్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రింగ్ రోడ్ గోడ పగిలిపోయి సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మాణం జరగకపోవడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. అసంపూర్తిగా ఉన్న ఈ రింగ్ రోడ్ వద్ద ఇప్పటికే అనేక వాహనాలు గుద్దుకుని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రింగ్ చుట్టూ నిర్మించిన రక్షణ గోడ కూలిపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. వేగంగా వచ్చే వాహనాలకు రహదారి స్పష్టంగా కనిపించక రింగ్‌లోపలికి వెళ్లిపోయే ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ముఖ్యంగా కోదురుపాక బ్రిడ్జి నుంచి రుసో కాలేజీ వరకు డివైడర్‌లో లైటింగ్ సదుపాయం లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఇన్ని సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడం దురదృష్టకరమని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రింగ్ రోడ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, బ్రిడ్జి నుంచి రుసో కాలేజీ వరకు హెచ్చరిక బోర్డులు, వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలి

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 51లో ఉన్న ఎస్సీ కాలనీ ప్రభుత్వ భూమిని నిరు పేదలకు కేటాయిం చాలని బుధవారం మాదిగ సంఘ సభ్యులు తహoooooooంసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సొంతింటి స్థలం లేక ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఈ భూమిని కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘ అధ్యక్షుడు లింగంపల్లి అర్జున్‌తో పాటు సురేష్, శంకర్, దేవయ్య, రాజేందర్, బాబు, నరసయ్య, లక్ష్మీరాజం, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం

## - గర్భాశయ క్యాన్సర్ నివారణలో కీలకం : వైద్యులు



**వేద న్యూస్, మెట్‌పల్లి :**

మెట్‌పల్లి పట్టణంలోని సాయిరామ్ నగర్ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, 4వ వార్డు కౌన్సిలర్ పందిరి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డా. ఎల్లాల అంజిత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 14 సంవత్సరాలు పూర్తిచేసుకుని 15 సంవత్సరాలు పూర్తి కాకముందున్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ వ్యాక్సిన్ గర్భాశయ ముఖ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి రక్షణ లభిస్తుందని, దీని వల్ల భవిష్యత్తులో మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ఇది సురక్షితమైన మరియు ప్రభావవంతమైన వ్యాక్సిన్ అని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉందని తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు 15 సంవత్సరాలు పూర్తికాకముందే తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులు అర్కుటి భూధమ్మ, ఆదుర్తి కళ్యాణి ఎల్లయ్య, ఆదుర్తి కళ కిషన్, కనుకుంట్ల మైహిత రాజశేఖర్ తమ ఇళ్లలో గృహప్రవేశం నిర్వహించగా, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కలలను సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గత రెండేళ్లలో చొప్పదండి నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. కురిక్యాల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 208 ఇళ్లను మంజూరు చేయగా, అందులో 94 మంది లబ్ధిదారులు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు చెప్పారు. ఇంకా ఇళ్లు అందని అర్హులైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో ప్రతి అర్హుడికి ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం జరగలేదని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అంబటి రజిత, ఎంపీడీఓ దమ్మని రాము, సర్పంచ్ కడారి హారిక కనకయ్య, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పంపు మోటార్లు ఎత్తుకెళ్లిన దొంగలు

**వేద న్యూస్, నల్లబెల్లి :**

ఒకవైపు విత్తనాలు, ఎరువుల ఖర్చులతో రైతులు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు దొంగలు వ్యవసాయ పరికరాలను దొంగిలిస్తూ రైతులను మరింత కష్టాల్లోకి నెడుతున్నారు. నల్లబెల్లి మండలం కొండారుపల్లి గ్రామానికి చెందిన పెంతల వనమ్మ, కొలగాని సదయ్య, ముసుకు చిన్న కొమురెల్లి అనే రైతుల వ్యవసాయ పంపు మోటార్లు దొంగతనానికి గురైనట్లు తెలిసింది. నల్లబెల్లి నుండి కొండారుపల్లికి వెళ్లే మార్గమధ్యంలోని ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి ఎడమ వైపున ఉన్న వరి పొలాలకు నీరు అందించేందుకు అమర్చిన మోటార్లు, స్టార్టర్లు కనిపించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దొంగిలించిన మోటార్ల విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని వారు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



## - రైతులకు రూ.60 వేల నష్టం

# నేరెళ్ల యాదవ సంఘం అధ్యక్షుడిగా కుమారస్వామి



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం నేరెళ్ల గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దద్దు కుమారస్వామి యాదవ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా గోపురవేణి తిరుపతి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దొంగల రాజు, కార్యదర్శిగా బేతి రవీందర్, కోశాధికారిగా మొర్రి రవీందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధికి తాను పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు మాజీ సర్పంచ్ దొంగల శ్రీనివాస్ తిరుపతమ్మ, మాజీ ఎంపీటీసీ కొండం శ్రీనివాస్, సంఘ సభ్యులు మరియు గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు

# ప్రజలకు చేరువగా పోలీసింగ్

## - వీపీఓ వ్యవస్థ అమలు చేయాలి
## - అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు
## - ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి, పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ (విపిఒ) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేసి, గ్రామాల్లో ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించిన ఎస్పీ, పదిర ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

# అంతరాయం లేని విద్యుత్ సరఫరా లక్ష్యం

- వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు వేగం
- సెస్ ఉద్యోగులకు రూ.కోటి బీమా
- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో విద్యుత్ సేవలను మెరుగుపరచడంపై టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి దృష్టి సారించారు. బుధవారం సెస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో అంతరాయం లేకుండా సరఫరా అందించేందుకు ఓవర్‌లోడ్ ఉన్న 11 కేవీ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. మెయింటెనెన్స్ పనులను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ వినియోగదారులకు యూనిఫామ్ సర్వీస్ లైన్ చార్జెస్ (ఎస్ఎల్‌సీ) విధానాన్ని అమలు చేస్తూ, 1 కిలోవాట్‌కు రూ.1000 మాత్రమే వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 2491 వ్యవసాయ కనెక్షన్లను మూడు నెలల్లో మంజూరు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్, ఫాల్ట్ ఇండికేటర్ల వినియోగం పెంచాలని, 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ఉద్యోగుల భద్రత కోసం రూ.కోటి ప్రమాద బీమాను సెస్ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తామని తెలిపారు.

# వెంకటేశ్వరస్వామి సేవలో విప్ ఆది శ్రీనివాస్

**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగగా, గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

# వడగాలుల నష్టాల నివారణకు చర్యలు తీసుకోవాలి



- చలివేంద్రాలు, తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

వేసవి వడగాలుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామీణపట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఉపాధిహామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాల్లో అపశృతి

- పందిరి కూలిపోవడంతో భక్తులకు గాయాలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణం
- సుంకె రవిశంకర్ ఆగ్రహం




**వేద న్యూస్, మల్యాలలకొండగట్టు :**

జగిత్యాల జిల్లా మల్యాల-కొండగట్టు ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. కేశఖండనం వద్ద ఏర్పాటు చేసిన చలవ పందిరి కూలిపోవడంతో పలువురు భక్తులు గాయపడ్డారు. ఈ ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ భక్తుల రద్దీ ఉంటుందని ముందే తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని ఆరోపించిన ఆయన, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేవని, నాసిరకం పనుల వల్లే ప్రమాదం జరిగిందని విమర్శించారు. ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## జడ్చర్ల బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వేద న్యూస్, జడ్చర్ల :**

జడ్చర్ల న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బి. యాది రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శిగా సల్లా రాములు, కోశాధికారిగా పాండు కుమార్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా లక్ష్మీనారాయణ, గ్రంథాలయ కార్యదర్శిగా సాహితీ రెడ్డి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా హాజీ అబ్దుల్ రవుఫ్ బాధ్యతలు స్వీకరించారు. ఈసీ సభ్యులుగా విజయలక్ష్మి, తిరుపతయ్య, శేషమ్మ తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను న్యాయవాదులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు గ్రామసభల నిర్వహణ

**వేద న్యూస్, గంగాధర :**



- ఎంపీడీఓ రాము

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీ డీఓ రాము తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉదయం 10 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభలు సజావుగా సాగేందుకు ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామసభల ఏర్పాట్లపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 1 నుంచి 30 వరకు పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ మేరకు పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తా రోకోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించరాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని సూచించారు

# గుడి నిర్మాణానికి భూమి పూజ

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. దాతలు మారుపాక లచ్చయ్య, కాదాసు నర్సయ్య, బింగి లచ్చవ్వ, కాదాసు పోచవ్వ గుడి నిర్మాణానికి భూమిని విరాళంగా అందించారు. ఆదర్శ హరిజన సేవా సమితి ఆధ్వర్యంలో వేద పండితులు తులసిమొగ్గ సాయి కుమార్ పూజలు నిర్వహించగా, వాస్తు పండితుడు కత్తి తిరుపతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు గద్దరాశి దేవయ్య - లక్ష్మి దంపతులు, సర్పంచ్ సహనాజ్- సమీర్, ఉపసర్పంచ్ గంట మల్లేశం, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గుడి నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ గంట మల్లేశం ఒక టిప్పర్ రాయి అందజేయగా, బిళ్ళ వాణి - నరేష్ మకర తోరణం మరియు రూ.5,116 విరాళం ప్రకటించారు. గ్రామస్తులంతా ముందుకు వచ్చి గుడి నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు సాధించిన జడ్చర్ల మున్సిపాలిటీ



**వేద న్యూస్, జడ్చర్ల :**

జడ్చర్ల పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘం నిధులు పొందడంలో విజయాన్ని సాధించింది. ప్రాపర్టీ టాక్స్ లక్ష్యం రూ.3.90 కోట్లు సాధించేందుకు కృషి చేసిన రెవిన్యూ, మున్సిపల్ సిబ్బందిని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ, ప్రాపర్టీ టాక్స్ లక్ష్య సాధన మున్సిపాలిటీకి గొప్ప విజయమని, సిబ్బంది కృషికి ఇది ఫలితమని తెలిపారు. ఈ నిధులు పట్టణ అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బందిని సన్మానించారు. మున్సిపల్ ఏఈ గాయత్రి, శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్, మేనేజర్ లక్ష్మన్న, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, ప్రశాంత్ రెడ్డి, నంద కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు నివారణకు పశువులకు టీకాలు

**వేద న్యూస్, శంకరపట్నం :**



శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. గ్రా మ సర్పంచ్ ఊకంటి మాధవి-మధుకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగి ంది. గ్రామంలోని రైతులు తమ పశువులను ఈ వ్యాధి నుంచి రక్షించేందుకు పెద్ద సంఖ్యలో టీకాలు వేయించారు. మొత్తం 369 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థిక స్థిరత్వానికి కీలకమని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేకే ఓసీపీలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**వేద న్యూస్, మందమర్రి :**

సింగరేణిలో పెరుగుతున్న ఎండల నేపథ్యంలో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ బుధవారం మందమర్రి ఏరియాలోని కేకేఓసిపి ప్రాజెక్టులోని కార్మికులకు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ కేకేఓ సిపిలో ఒక్కరోజే 10,909. 44 టన్నుల బొగ్గును రవాణా చేసి సరికొత్త రికార్డు సాధించిందని, అలాగే మార్చి 2026 లో సాధించిన 2,30,464 ట న్నులు అత్యధికంగా రవాణా చేసి మరో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యధిక ఒకరోజు రవాణా గా నమోదు కావడం విశేషమని ఆయన హర్షం వ్యక్తం చేశాడు. మందమర్రి ఏరియాలో మొత్తం ఉత్పత్తి పురోగతిలో కేకే ఓ సి పి కీలక పాత్ర పోషిస్తుశీదని, ఇక్కడి పనితీరు సంస్థ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంద పేర్కొన్నారు. మార్చి నెల లో సాధించిన ఈ భారీ విజయం కేవలం ఉద్యోగుల క్రమశిక్షణ, నిబద్ధత, సమిష్టి కృషి వల్లే సాధ్యమవుతుంద ని పేర్కొన్నారు. ఇదే ఉత్సా హంతో రాబోయే రోజుల్లో మరిన్ని లక్ష్యాలను చేరుకోవాలని కొనియాడా రు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం మల్లయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకట వంశీధర్, సిఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ రాజేష్ కుమార్ యాదవ్ లు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ఏర్పాటు రద్దు చేయాలి

**- పాఠశాలల జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా**



**వేద న్యూస్, హుజురాబాద్ :**

హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ చర్య వల్ల పర్యావరణానికి ముప్పుతో పాటు ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాలని కోరుతూ బుధవారం అంబేద్కర్ కూడలిలో ప్రైవేట్ పాఠశాలల జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. డంపింగ్ యార్డ్ కారణంగా గాలి, నీటి కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా కారణంగా అంబేద్కర్ కూడలి వద్ద కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విద్యార్థులు కోరారు.

## లైసెన్స్ సర్వేయర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రంగు శివ

**- హైదరాబాద్‌లో ఏకగ్రీవంగా కొలువుదీరిన రాష్ట్ర నూతన కార్యవర్గం**





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ల సంఘం నూతన కార్యవర్గం బుధవారం హైదరాబాద్‌లో కొలువుదీరింది. సభ్యులందరి ఏకాభిప్రాయంతో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన రంగు శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే క్రమంలో రాష్ట్ర సలహాదారుడిగా దుగ్గొండికి చెందిన చెలికాని రాజు, రాష్ట్ర-జిల్లా సమన్వయకర్తగా గాదె అభినవ్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నగర రమేష్ ప్రకటించారు. శివ అంకితభావం, నిరంతర శ్రమను తగిన విధంగా గుర్తించి పూర్తి మద్దతుతో ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎన్నిక అనంతరం నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడు రంగు శివ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. సమీప భవిష్యత్తులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర 'భూభారతి' కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వేలు పూర్తిచేసి రైతుల భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని, దానికితోడు సర్వేయర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందుల సాధన కోసం నిరంతరం కృషిచేస్తానని ఉద్ఘాటించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నగర రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవునూరి రాజుతో పాటు రాష్ట్ర, జిల్లా సభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంగన్వాడీ సెంటర్లకు రంజన్ ల పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



మండల కేంద్రంలోని మూడు అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు బుధవారం అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చిన్నారులకు అన్న ప్రసన్న చేశారు. అనంతరం 8 అంగన్వాడీ సెంటర్లలో రంజన్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## వేద న్యూస్ కథనానికి స్పందన

**- రాజశేఖర్ చికిత్స నిమిత్తం రూ.15వేలు అందజేసిన వెంకటేశ్వర్లు**

**- పలువురు ముందుకు రావాలని పిలుపు**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమన గల్లు గ్రామానికి చెందిన ఊదరి రాజశేఖర్ చిన్న వయసులోనే న్యూమోనియా వ్యాధితో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడని మంగళ వారం వేద న్యూస్ పత్రిక ప్రచురించింది. ప్రజా సమస్యలను వెలికితీయడంలో వేద న్యూస్ పత్రిక ముందు వరుసలో నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు, వక్తలు సైతం "వేద న్యూస్" పత్రికను ప్రశంసిస్తున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వేద న్యూస్ పత్రిక "జన గొంతుకగా" నిలవాలని ఆకాంక్షిస్తున్నారు. న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న యువకుడు అనే శీర్షికకు టివిటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాళ్ల వెంకటేశ్వర్లు స్పందించారు. తక్షణమే తాళ్ల వెంకటేశ్వర్లు తన మానవత్వాన్ని చాటుకొని 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. యువకునికి అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. దీంతో ఊదరి రాజశేఖర్ కుటుంబ సభ్యులు "వేద న్యూస్" దినపత్రికకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



### న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న యువకుడు

- దాక్టర్లను సంప్రదిస్తే చికిత్స కోసం రూ.10 లక్షలు అవసరం
- సహాయం కోసం ఎదురుచూపులు

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన ఊదరి రాజశేఖర్ కు చిన్న వయసులోనే జీవనశైలిలో న్యూమోనియా వ్యాధితో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఊదరి రాజశేఖర్ కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయారు.ఇప్పుడు ఆయనకు చిన్న వయసులోనే న్యూమోనియా జబ్బు రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రస్తుతం రాజశేఖర్ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజశేఖర్ మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు డాక్టర్లను సంప్రదించగా రూ.10 లక్షల అవసరమని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు లేని అనాధ రాజేశేఖరకు అంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకురావాలో పాలు పోకపోవడంతో స్నేహితులు, బంధుమిత్రులు దాతల సహకారంతో కొంత డబ్బును ఆస్పత్రికి అందించారు. ఇంకా అతనికి కొంత డబ్బు అవసరం ఉండడంతో కుటుంబ సభ్యులు దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు, మానవత్వవాదులు, యువకులు తన తోచిన విధంగా సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం గూగుల్ పే, ఫోన్ పే ద్వారా నేరుగా 9010290930, 9542206194 పంపగలరని విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్యం, నీటి సరఫరా పకడ్బందీగా చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశం**

**వేద న్యూస్, వేములవాడ:**




వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్ష తన బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా నిరంతరంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ పన్నులు 100 శాతం వసూలు చేయాలని, తద్వారా ఆర్థిక సంఘం నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, వాటిని ఉపయోగకరంగా మార్చాలని సూచించారు. పార్కులు, పబ్లిక్ టాయిలెట్లు, వైకుంఠధామాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. బడ్జెట్ ప్రకారం మున్సిపల్ అంచనా ఆదాయం రూ. 26.68 కోట్లు కాగా, వ్యయం రూ. 26.05 కోట్లు, మిగులు రూ. 0.60 కోట్లు ఉందని వెల్లడించారు. ఈ సమావేశంలో చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**

**వేద న్యూస్,క్యాతనపల్లి :**



ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. ఏప్రిల్ 4, 2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికల దృష్ట్యా బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, ఎన్నికల వేదికలను స్థానిక ఏసీపీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశనిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సజావుగా జరిగేలా వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. చట్టంశాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ, సీఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎటువంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పరోక్ష ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ, సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ కోట మైసమ్మ తల్లిన్ని దర్శించుకున్న తహసీల్దార్

**వేద న్యూస్,కారేపల్లి :**



మండల కేంద్రమైన ఉసిరికాయలపల్లి గ్రామ సమీపాన వేంచేసియున్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారిని సింగరేణి మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న తహసీల్దార్‌కు ఆలయ అర్చకులు మరియు కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ తహసీల్దార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు మరియు సిబ్బంది, పగడాల మోహన్ కృష్ణ సాయి లలిత్ మరియు ఇతర రెవెన్యూ శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 02, 2026

# భక్తిభావం వెల్లివిరిసింది

**- ఆంజనేయ స్వాముల ఇరుముడి కార్యక్రమం**



**వేద న్యూస్, కారేపల్లి :**

హనుమన్నామస్మరణతో మారుతీ నిలయం మార్మోగింది. కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సామ్య తండా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ఆంజనేయ స్వామి దీక్ష విరమణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గత కొన్ని రోజులుగా కఠిన నియమ నిష్ఠలతో దీక్షను ఆచరించిన స్వాములు, సంప్రదాయబద్ధంగా ఇరుముడి కట్టుకుని స్వామివారిని దర్శించుకున్నారు. మారుతీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాలు దీక్ష విరమణ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేష హోమ పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది ఈ కార్యక్రమంలో హేమలత బాలాజీ పోలంపల్లి సర్పంచ్ &ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు, గుగులోత్ సర్వన్ ఉప సర్పంచ్, వాంకుడోత్ బన్సీలాల్ (పాత్రికేయులు), భూక్యా రవీందర్, బోడా రవి, హట్కర్ రాంబాబు, అంగోత్ రాములు, వాంకుడోత్ రవికుమార్, దారావత్ కళ్యాణ్, గుగులోత్ నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కేవలం ఒక మతపరమైన వేడుకగా కాకుండా, గ్రామంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించే వేదికగా నిలిచింది. నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఉత్సవం దిగ్విజయంగా ముగిసింది.

# మేడపల్లి ఎడమ కాలువలోకి గోదావరి జలాలు

**- రాస్తారోకో అనంతరం స్పందించిన అధికారులు**
**- రైతాంగానికి నూతన ఆశలు**

**వేద న్యూస్, నల్లబెల్లి :**

మేడపల్లి ఎడమ కాలువలోకి గోదావరి నీరు చేరడంతో నల్లబెల్లి-నర్సంపేట పరిసర ప్రాంత రైతాంగంలో ఆనందం నెలకొంది. ములుగు జిల్లా దేవాదుల పంప్ హౌస్ నుంచి ట్రయల్ రన్‌లో ఎత్తిపోతల ద్వారా విడుదలైన నీరు రంగాయ చెరువుకు చేరి, అక్కడి నుంచి ఎడమ కాలువలోకి ప్రవహిస్తోంది. ఏళ్లుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న సుమారు 2000 ఎకరాల పంటలకు ఇప్పుడు ఉపశమనం లభించనుంది. ఇటీవల మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చేపట్టిన రాస్తారోకో అనంతరం అధికారులు వెంటనే స్పందించి నీటి విడుదల చేపట్టడం రైతుల్లో విశ్వాసాన్ని పెంచింది. ఈ నీరు మేడపల్లి, చిన్న గొల్లపల్లి, దబిడిపేట, అశోక్ నగర్-దూసముద్రం శివారు చెరువుల మీదుగా నర్సంపేట మండలం ఇటకాలపల్లి వరకు చేరుతోంది. ఎండిపోతున్న పొలాలు మళ్లీ పచ్చదనంతో కళకళలాడనున్నాయి. గోదావరి జలాలతో నర్సంపేట నియోజకవర్గం సస్యశ్యామలం కావాలన్న ఆశలు రైతుల్లో మళ్లీ చిగురిస్తున్నాయి.



# నాటక రచయిత, నిర్వాహకులకు ఘన సన్మానం

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ రామన్నపేటలో డా. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోతన ఆడిటోరియంలో పూరి జగన్నాథ దేవాలయ చరిత్రపై పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటక రచయిత పి.ఎల్.ఎన్ ప్రసాద్‌ను, ముఖ్య అతిథి నెల్లుట్ల రవీందర్ రావును, ఆత్మీయ అతిథి బన్న ఐలయ్యను ట్రస్ట్ ప్రతినిధులు శాలువాలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. నాటక ప్రదర్శనపై ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలను ప్రోత్సహించడం ద్వారా సంస్కృతి, చరిత్రను భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. నాటకంలోని పాత్రలు, నిర్మాణం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురాని గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**వేద న్యూస్, జడ్చర్ల :**

ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన 179 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్య పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

**వేద న్యూస్, దేవరకద్ర:**

అమరచింత మండలం కొంకనోనిపల్లి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి బి. వెంకటేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతులకు యూరియా సరఫరా సకాలంలో అందేలా చూడాలని, యూరియా యాప్‌ను రద్దు చేయాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వరి, మొక్కజొన్న, పామాయిల్ రైతులను ఆదుకోవాలని అన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజిరెడ్డి, మహేష్, మొగిలిన్న, నరేష్, రాజు, బాల్రాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



**- రైతు సంఘం నాయకులు**

# గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కారం

**వేద న్యూస్, శంకరపట్నం:**



**- ఎంపీడీవో కృష్ణ ప్రసాద్**

శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామసభల నిర్వహణపై ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండలంలోని 27 గ్రామాల్లో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, డిప్యూటీ తహసీల్దార్ ఖాదర్, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# యాదవ్ ల మహా సన్మాన సభను విజయవంతం చేయాలి

**వేద న్యూస్ ,కారేపల్లి:**



యాదవ సామాజిక వర్గ రాజకీయ చైతన్యాన్ని చాటిచెప్పే విధంగా, ఈ నెల 5వ తేదీన (ఆదివారం) ఖమ్మం నగరంలో నిర్వహించ తలపెట్టిన "యాదవ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం" విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం కారేపల్లి మండల కేంద్రంలో కారేపల్లి గ్రామ ప్రముఖులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లు, జన సమీకరణపై కీలక చర్చలు జరిపారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని కృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి నవీన్ యాదవ్ హాజరుకానున్నారు. వారితో పాటు రాష్ట్రస్థాయి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు ఈ వేదికను అలంకరించనున్నారు. కారేపల్లి నేతల మద్దతు ఈ సమావేశంలో కారేపల్లి గ్రామానికి చెందిన యాదవ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు యాదవ్, అడ్డగూడ ఐలయ్య యాదవ్, గడ్డం వెంకటేశ్వర్లు,బోళ్ళ రమేష్ యాదవ్,దేగల ఉపేందర్ యాదవ్, మేకల కుమారస్వామి వీరితో పాటు మండల మరియు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని, ఖమ్మం సభను విజయవంతం చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు.

## 'సమాజమా స్పందించుమా' పాట వీడియో ఆవిష్కరణ

**వేద న్యూస్, శాయంపేట :**




'సమాజమా స్పందించుమా - అత్యాచారం క్షమించరాని నేరం' అనే సామాజిక అవగాహన పాట వీడియోను శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు, సబ్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రచయిత మొగ్గం సుమన్ రచించిన ఈ పాటను సింగర్ తుడుం క్రాంతి కుమార్ ఆలపించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో మహిళల గౌరవం, భద్రతపై అవగాహన కల్పించే ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు సమాజం మొత్తం ముందుకు రావాల్సిన అవసరం ఉందని, మహిళల రక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి సాహిత్య, సంగీత కార్యక్రమాలు సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దుబాసి కృష్ణమూర్తి, మారపల్లి క్రాంతికుమార్, అరికిల్ల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన బార్ నూతన కార్యవర్గం

**వేద న్యూస్, వేములవాడ :**



వేములవాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా అడిషనల్ పిడిజే పుష్పలత, ఏవో సత్యనారాయణమూర్తిని కూడా కలిసి సన్మానించారు. నూతన అధ్యక్షుడు పిట్టల మనోహర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శాలువాలు కప్పి సన్మానించి, రాజన్న లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కోరారు. న్యాయవ్యవస్థ పట్ల తమ కట్టుబాటును వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గొంటి శంకర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ కనికరపు, కోశాధికారి జెట్టి శేఖర్, క్రీడల కార్యదర్శి కర్ణ వంగల, గ్రంథాలయ కార్యదర్శి మొగిలి సుజాత, మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల రైతులను ఆదుకోవాలి

- ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసి సాగునీరు అందించాలి
- బీసీ జేఏసీ నాయకులు

**వేద న్యూస్, మదనపురం:**



మదనపురం మండలంలోని నెలివిడి-నర్సింగాపురం ఎత్తి పోతల రిజర్వాయర్ కింద సాగు చేస్తున్న రైతులను ప్రభు త్వం ఆదుకోవాలని బీసీ పొలిటి కల్ జేఏసీ మండల అధ్యక్షుడు బి. మహేందర్ నాయుడు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కింద సుమారు 1200 ఎకరాల్లో సాగు జరుగుతుండగా, సాగునీరు అందక దాదాపు 400 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని తెలిపారు. కొన్నూరు, నెలివిడి, ద్వారకనగర్, నర్సింగాపురం, పెద్ద తాండ గ్రామాలకు సాగునీరు అందుతోందని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని, వెంటనే మరమ్మతులు చేపట్టి మిగిలిన భూములకు సాగునీరు అందించాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గూడుష రవికుమార్, నాగిరెడ్డి, చంద్రయ్య, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరలో హోంగార్డ్ ఆత్మహత్య

**వేద న్యూస్ నాగర్ కర్నూల్ :**



నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం సలేశ్వరం జాతరలో హోంగార్డ్ ఆత్మహత్య కలకలం సృష్టిస్తోంది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచుగూడెంకు చెందిన బయన్న(46) కోడేరు పోలీస్ స్టేషన్ లో హోంగార్డు గా విధులు నిర్వహిస్తున్నారు.సలేశ్వరం జాతరలో బందోబస్తులో ఉన్న ఆయన విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పోలీస్ సిబ్బంది హోంగార్డును అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య మూడు సంవత్సరాల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. సలేశ్వరం జాతర సందర్భంగా బందోబస్తు డ్యూటీ పడిన పోలీస్ సిబ్బందికి అచ్చంపేటలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బయన్న గైరాజయ్యాడని పోలీసులు తెలిపారు.

# లేబర్ కోడ్లు రద్దు చేయాలి

**వేద న్యూస్, దేవరకద్ర:**

ఆత్మకూరు మండలంలో పురపాలక సంఘం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. పని గంటలను పెంచడం, వేతనాలు మరియు సమ్మె హక్కులను పరిమితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వాటి రద్దు వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు వేణుగోపాల్, పల్లవి, స్వప్న, శ్రావణి, చంద్రకళ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




– సీఐటీయూ డిమాండ్

# 'సీపీతో ఒక రోజు' కార్యక్రమం ప్రారంభం

**వేద న్యూస్ హైదరాబాద్ :**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు 'సీపీతో ఒక రోజు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి 45 రోజుల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల 8వ నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కల్పించనున్నారు. ప్రతి రోజూ ఒక పాఠశాల నుంచి 20 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, పోలీస్ శాఖలోని వివిధ విభాగాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఈ కార్యక్రమాన్ని బషీర్బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రారంభించారు. విద్యార్థుల సమక్షంలో భద్రతా ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, ఫిర్యాదులు స్వీకరించే విధానం, సమస్యల పరిష్కార ప్రక్రియను వివరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు తమ పర్యటనలో భాగంగా బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రధాన పోలీస్ కంట్రోల్ రూమ్, ఐటి విభాగం, ప్రత్యేక శాఖ, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ విభాగం వంటి కేంద్రాలను సందర్శించారు. అక్కడి అధికారులు నేర నియంత్రణలో సాంకేతికత పాత్ర, మహిళల భద్రత, చట్టవ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ, పోలీస్ వ్యవస్థ కేవలం నేర నియంత్రణకు మాత్రమే కాకుండా ప్రజలకు సేవ చేయడానికే ఉన్నదని తెలిపారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, స్ఫూర్తి కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని మహిళా భద్రత విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

# భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు.. షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా మరియు జింబాబ్వే మధ్య రెండు కీలక అంతర్జాతీయ సిరీస్‌లకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ ఏడాది జూలైలో భారత జట్టు జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుండగా, 2027 జనవరిలో జింబాబ్వే జట్టు భారత్‌లో వన్డే సిరీస్‌కు రానుంది. జింబాబ్వే క్రికెట్ బోర్డు జింబాబ్వే క్రికెట్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జూలై 23, 25, 26 తేదీల్లో మూడు టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా నిర్వహించనున్నారు. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో కూడా ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ, భారత్‌తో మ్యాచ్‌లు ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తాయని తెలిపారు. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం తమ ఆటగాళ్లకు గొప్ప అవకాశమని, ప్రపంచకప్‌లో చేసిన ప్రదర్శనను కొనసాగించాలనే లక్ష్యంతో ఈ సిరీస్‌కు సిద్ధమవుతున్నామని చెప్పారు. ఇక 2027 జనవరిలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌లో మూడు వన్డే మ్యాచ్‌లు జరుగనున్నాయి. అవి కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) నగరాల్లో నిర్వహించనున్నారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషంగా నిలిచింది. ఈ పర్యటనపై మకోనీ స్పందిస్తూ, రెండు దశాబ్దాల తర్వాత భారత్‌లో సిరీస్ ఆడటం చారిత్రాత్మక క్షణమని పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, తమ జట్టుకు విలువైన అనుభవాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కూపర్ కాన్లీ అరంగేట్రం అదిరింది.. పాంటింగ్ ప్లాన్ సూపర్ హిట్

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026లో అరంగేట్ర మ్యాచ్‌లోనే కూపర్ కాన్లీ అదిరిపోయే ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన కాన్లీ, గుజరాత్‌పై జరిగిన మ్యాచ్‌లో ఒంటిచేత్తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ జట్టుకు ప్రారంభంలో కాస్త ఒత్తిడి ఉన్నా, కాన్లీ తన క్లాస్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు విజయం అందించాడు. ఐపీఎల్ అరంగేట్రంలోనే మ్యాచ్ విన్నర్‌గా నిలవడం విశేషం. ఈ విజయానికి మరో ముఖ్య కారణం హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం. సాధారణంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసే కాన్లీని ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాడు. ఈ నిర్ణయం సూపర్ హిట్ అయి, టాప్ ఆర్డర్‌లో ఆడిన కాన్లీ తన ప్రతిభను నిరూపించాడు. ఐపీఎల్ వేలంలో రూ.3 కోట్లకు కాన్లీని కొనుగోలు చేసినప్పుడే అతడిపై పాంటింగ్‌కు విశ్వాసం ఉందని స్పష్టమైంది. ఎడమచేతి బ్యాటర్ కావడంతో జట్టులో లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌కు కూడా ఉపయోగపడతాడని ముందుగానే భావించారు. ఇక బిగ్ బాష్ లీగ్‌లో కూడా కాన్లీ మంచి రికార్డు సాధించాడు. ఇప్పటివరకు 34 మ్యాచ్‌లలో 786 పరుగులు చేసి, బౌలింగ్‌లో 27 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో అతడిని మాజీ ఆటగాడు షాన్ మార్ష్‌తో పోలుస్తున్నారు. ప్రపంచ స్థాయి స్పిన్నర్ రషీద్ ఖాన్ బౌలింగ్‌ను కూడా కాన్లీ ధైర్యంగా ఎదుర్కొని కీలక పరుగులు సాధించడం గమనార్హం. ఇలాగే కొనసాగితే పంజాబ్ కింగ్స్‌కు ఈ సీజన్‌లో అతడు కీలక ఆటగాడిగా మారే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఫిఫా వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ వచ్చేసింది



**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ అధికారికంగా విడుదలైంది. జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనున్న ఈ మెగా టోర్నీ ఈసారి మరింత విస్తృతంగా నిర్వహించనున్నారు. ఈ ప్రపంచకప్ ప్రత్యేకత ఏమిటంటేడ తొలిసారిగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడనున్నాయి. అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నాయి. మొత్తం 16 నగరాల్లో 104 మ్యాచ్‌లు జరగనుండగా, అందులో 78 మ్యాచ్‌లు అమెరికాలోనే నిర్వహించనున్నారు. కెనడా, మెక్సికో చెరో 13 మ్యాచ్‌లకు వేదికలు కానున్నాయి. ఫైనల్ మ్యాచ్ న్యూజెర్సీ స్టేడియంలో జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా అర్జెంటీనా జాతీయ ఫుట్‌బాల్ జట్టు బరిలోకి దిగుతోంది. స్టార్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ నేతృత్వంలో ఆ జట్టు మరోసారి టైటిల్‌పై కన్నేసింది. ఇక ఈసారి కూడా నాలుగు సార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఇటలీ జాతీయ ఫుట్‌బాల్ జట్టు టోర్నీకి అర్హత సాధించలేకపోయింది. బోస్నియాతో జరిగిన క్వాలిఫైయర్‌లో ఓటమి పాలవడంతో వరుసగా మూడోసారి ప్రపంచకప్‌కు దూరమైంది.

**గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి:**

గ్రూప్ ఎ మెక్సికో, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, చెకియా
గ్రూప్ బి కెనడా, బోస్నియా మరియు హెర్జెగోవినా, ఖతార్, స్విట్జర్లాండ్
గ్రూప్ సి బ్రెజిల్, మొరాకో, హైతీ, స్కాట్లాండ్
గ్రూప్ డి యుఎస్ఎ, పరాగ్వే, ఆస్ట్రేలియా, టర్కీ
గ్రూప్ ఇ జర్మనీ, కురసావో, ఐవరీ కోస్ట్, ఈక్వెడార్
గ్రూప్ ఎఫ్ నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, ట్యునీషియా
గ్రూప్ జి బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్
గ్రూప్ హెచ్ స్పెయిన్, కేప్ వెర్డే, సౌదీ అరేబియా, ఉరుగ్వే
గ్రూప్ ఐ ఫ్రాన్స్, సెనెగల్, నార్వే, ఇరాక్/బొలీవియా
గ్రూప్ జె అర్జెంటీనా, అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్
గ్రూప్ కె పోర్చుగల్, డిఆర్ కాంగో, ఉజ్బెకిస్తాన్, కొలంబియా
గ్రూప్ ఎల్ ఇంగ్లాండ్, క్రొయేషియా, ఘానా, పనామా

ఈసారి విస్తృత ఫార్మాట్‌తో, ఎక్కువ మ్యాచ్‌లతో జరగనున్న ఈ ప్రపంచకప్ అభిమానులకు మరింత ఉత్సాహాన్ని అందించనుంది.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 02, 2026

# ఐదు భాషల్లో ఫుల్ బిజీగా ఉన్న లేడీ సూపర్ స్టార్




**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణ భారత సినీ పరిశ్రమలో లేడీ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన నయనతార ప్రస్తుతం ఐదు భాషల్లో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారింది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ, మలయాళం, ఇప్పుడు కన్నడలో కూడా సినిమాలు చేస్తూ తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. 'లేడీ సూపర్ స్టార్' అనే బిరుదుతో ప్రేక్షకుల మన్ననలు పొందిన నయనతార, బాలీవుడ్‌లోకి కూడా విజయవంతంగా అడుగుపెట్టింది. జవాన్ సినిమాలో షారుఖ్ ఖాన్ సరసన నటించి తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. నయనతార అసలు పేరు డయానా మరియం కురియన్. 2003లో మలయాళ చిత్రం 'మనసినక్కరే'తో సినీ ప్రయాణం ప్రారంభించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తమిళంలో 'అయ్యా' ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. తెలుగులో శ్రీరామరాజ్యం సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ఈ చిత్రానికి ఫిలింఫేర్ అవార్డును కూడా అందుకుంది. కెరీర్‌లో మాత్రమే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ ఆమె ఎన్నో మార్పులు చూసింది. 2022లో దర్శకుడు విఘ్నేష్ శివన్ను వివాహం చేసుకుంది. తర్వాత సరోగసీ ద్వారా ఇద్దరు పిల్లలకు తల్లిగా మారింది. ప్రస్తుతం నయనతార దక్షిణ భారతంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలిచింది. ఒక్కో సినిమాకు రూ. 20–25 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక సినిమాల విషయంలో ఆమె స్పీడ్ మరింత పెంచింది. ఇప్పటికే పలు ప్రాజెక్టులు లైన్లో ఉండగా, ఐదు భాషల్లో సినిమాలు చేస్తూ యమా బిజీగా కొనసాగుతోంది. ఇదే కారణంగా నయనతార క్రేజ్ రోజురోజుకూ పెరుగుతూ 'లేడీ సూపర్ స్టార్' బిరుదుకు తగినట్లుగా దూసుకుపోతోంది.

# లేడీ డైరెక్టర్ చున్నీతో సంగీత్ శోభన్ చేసిన పని వైరల్..

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో యంగ్ హీరో సంగీత్ శోభన్, లేడీ డైరెక్టర్ మానస శర్మతో కలిసి చేసిన ఓ చిన్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రాకాస' సినిమా ప్రమోషన్స్ సందర్భంగా జరిగిన ఈ సంఘటనపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. తెలుగు సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు అరుదుగా కనిపించే సమయంలో, తనదైన స్టైల్‌తో గుర్తింపు తెచ్చుకుంటున్న మానస శర్మ, ఇప్పుడు రాకాస సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల నిర్మిస్తుండగా, జీ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఏప్రిల్ 3న ఈ సినిమా విడుదల కానుంది. ఇటీవల మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్‌లో, సంగీత్ శోభన్ తన పక్కన నిలబడి ఉన్న మానస శర్మ చున్నీతో అనుమతి లేకుండానే తన కళ్లద్దాలు తుడుచుకోవడం కనిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, నెటిజన్లు దీనిపై విభిన్నంగా కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఇది సరదాగా జరిగిన విషయం అని భావిస్తుండగా, మరికొందరు మాత్రం "అనుమతి తీసుకుని ఉండాలి" అంటూ అభిప్రాయపడుతున్నారు. "మానస శర్మ చాలా సింపుల్‌గా తీసుకుంది గానీ, వేరే వాళ్లైతే సీరియస్ అయ్యేవాళ్లు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక దర్శకురాలు మానస శర్మ కెరీర్ విషయానికి వస్తే.. శ్రీకాకుళంలో ప్రారంభమైన ఆమె ప్రయాణం యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ 'మ్యాడ్ హౌస్'తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత వెబ్ సిరీస్‌లతో తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుని, ఇప్పుడు ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌తో అడుగు పెడుతోంది. మొదట



'రాకాస' కథను వెబ్ సిరీస్‌గా తెరకెక్కించాలని భావించినప్పటికీ, సంగీత్ శోభన్ ఎంట్రీతో ఈ ప్రాజెక్ట్‌ను సినిమాగా మార్చినట్లు తెలుస్తోంది. కథ విన్న వెంటనే నిహారిక కొణిదెల నిర్మాణానికి ముందుకు రావడం విశేషం. బడ్జెట్ పెరిగినా, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదని చిత్రబృందం చెబుతోంది. హర్రర్, కామెడీ, ఫాంటసీ ఎలిమెంట్స్ మేళవించిన ఈ సినిమా థియేటర్‌లో మంచి అనుభూతిని ఇస్తుందని దర్శకురాలు నమ్మకం వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న 'రాకాస' టీమ్, ఈ వైరల్ ఘటనతో మరింత హైలైట్ అయింది.

# పెళ్లిపై సాయి పల్లవి సంచలన వ్యాఖ్యలు..



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో తన సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాయి పల్లవి మరోసారి తన ఆలోచనా విధానంతో అందరి దృష్టిని ఆకర్షించింది. పెళ్లి అనే అంశంపై ఆమె చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి.. పెళ్లి గురించి సమాజంలో ఉన్న విభిన్న అభిప్రాయాలపై మాట్లాడింది. "చాలా మంది పెళ్లి చేసుకున్న తర్వాత మిగతావారికి 'పెళ్లి చేసుకోకపోవడమే మంచిది' అని చెబుతుంటారు. అలాంటి మాటలు వింటూ పెరిగిన నేను, ఒక దశలో పెళ్లిపై పెద్దగా పాజిటివ్ అభిప్రాయం ఏర్పరుచుకోలేక పోయాను" అని ఆమె చెప్పింది. అయితే ఈ అభిప్రాయం ఒక్క వైపు మాత్రమే కాదని, పెళ్లి అనే బంధం మనిషి జీవితంలో ఎంతో ముఖ్యమని కూడా ఆమె స్పష్టం చేసింది. "నన్నడిగితే ప్రతి బంధానికి మూలం పెళ్లే. ఒక కుటుంబం, ఒక వ్యవస్థ, అనుబంధాలు ఇవన్నీ పెళ్లి వల్లే ఏర్పడతాయి. మనిషి జీవితంలో అనుభవించే అనేక భావోద్వేగాలకు, అనుబంధాలకు ఇది పునాది" అని వివరించింది. తన భావనను మరింత బలంగా చెప్పడానికి సాయి పల్లవి ఒక భావోద్వేగ ఉదాహరణను ఇచ్చింది. "మనకు చిన్న చిన్న విషయాల్లో కూడా ఆదరణ అవసరం అవుతుంది. ఉదాహరణకు.. మనం మధ్యరాత్రి భోజనం చేయకుండా అలుగుతుంటే, మనల్ని బుజ్జగించి తినిపించేది అమ్మ మాత్రమే. ఆ అమ్మ అనే బంధం ఎలా ఏర్పడింది? అది కూడా పెళ్లి అనే వ్యవస్థ వల్లే కదా" అని ప్రశ్నించింది. ఆమె మాటల్లో పెళ్లిపై విమర్శ మాత్రమే కాకుండా, దాని గొప్పతనాన్ని గుర్తించే పరిపక్వత కనిపించడం విశేషం. ఒకవైపు నేటి తరం పెళ్లి అనే బంధాన్ని లైట్‌గా తీసుకుంటున్న తరుణంలో, మరోవైపు ఆ బంధం వెనుక ఉన్న భావోద్వేగ విలువలను గుర్తు చేస్తూ సాయి పల్లవి చెప్పిన మాటలు నెటిజన్లను ఆలోచింపజేస్తున్నాయి. సాయి పల్లవి వ్యక్తిత్వానికి తగ్గట్టుగానే ఆమె అభిప్రాయాలు కూడా ఎప్పుడూ నిష్కపటంగా, నిజాయితీగా ఉంటాయని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ తన ఆలోచనలతో ప్రత్యేకతను చాటుకుంటున్న ఆమె, మరోసారి తన మాటలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది.

# నీ ముఖానికి బంగారు గొలుసు వేసుకునేంత సీన్ ఉందా..!



**వేద న్యూస్ డెస్క్:**

ఇండస్ట్రీలో హీరోయిన్‌గా నిలదొక్కుకునేందుకు కష్టపడుతున్న యువ నటి రషికా శెట్టి తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజాగా బయటపెట్టింది. తన ప్రతిభతో, పట్టుదలతో అవకాశాలు సంపాదించుకుంటూ ముందుకు వెళ్తున్న ఆమె, మొదట్లో ఎంత కష్టపడ్డానో చెప్పుకుంటూ భావోద్వేగానికి గురైంది. చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉన్న రషికా, మోడలింగ్, టెలివిజన్ రంగాల ద్వారా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. చిన్న చిన్న పాత్రలు, ప్రకటనలు, సీరియల్స్ చేస్తూ అనుభవాన్ని పెంచుకుని, ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టింది. ఆమె నటించిన 'మంద కథలు' సినిమాలోని పాత్రకు మంచి స్పందన లభించింది. అలాగే బిగ్ బాస్ కన్నడ సీజన్ 12లో పాల్గొనడం ద్వారా ఆమెకు మరింత గుర్తింపు వచ్చింది. ఈ షోలో తన నిజాయితీ, వ్యక్తిత్వంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయినప్పటికీ ఈ స్థాయికి రావడం ఆమెకు అంత ఈజీ కాదు. కెరీర్ ప్రారంభ దశలో ఎన్నో నిరాకరణలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నానని రషికా తెలిపింది. ముఖ్యంగా ఒక సంఘటన తనను తీవ్రంగా బాధించిందని వెల్లడించింది. "నీ ముఖానికి నిజమైన బంగారు గొలుసు వేసుకునేంత సీన్ ఉందా?" అంటూ ఒకరు ముఖం మీదే అవమానించారని చెప్పింది

# ఎల్లమ్మకు ఇంతమంది హీరోలు ఎందుకు మారారు..



**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిన బలగం సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టిని తనవైపు తిప్పుకున్న వేణు ఎల్దండి ఇప్పుడు 'ఎల్లమ్మ' సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. కమెడియన్‌గా జబర్దస్త్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వేణు, దర్శకుడిగా మారిన తర్వాత తన కథలతో ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. 'బలగం' సినిమా భారీ విజయంతో పాటు అవార్డులను కూడా సొంతం చేసుకోవడంతో వేణు తదుపరి సినిమా 'ఎల్లమ్మ'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ హీరోగా నటించడం విశేషం. అయితే ఈ సినిమా ప్రారంభం నుంచి హీరో మార్పులపై అనేక వార్తలు వినిపించాయి. మొదట హీరోగా నానిను అనుకున్నారు. ఆ తర్వాత నితిన్ పేరు తెరపైకి వచ్చింది. కానీ ఆయన కూడా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. మధ్యలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్నాడని ప్రచారం జరిగినప్పటికీ, చివరికి దేవీ శ్రీ ప్రసాద్‌తో సినిమాను ఫైనల్ చేశారు. ఇంతమంది హీరోలు మారడానికి గల అసలు కారణాన్ని వేణు తాజాగా వెల్లడించాడు. కథను మొదట రాసే సమయంలో ఒక హీరోను ఊహించుకుని రాస్తామని, కానీ కథ అభివృద్ధి చెందే కొద్దీ పాత్రలో మార్పులు వస్తాయని తెలిపారు. పాత్రకు తగ్గట్టు నటుడిని ఎంపిక చేయాల్సి రావడం వల్ల హీరోలు మారాల్సి వస్తుందని చెప్పారు. అదేవిధంగా, కాల్‌షీట్లు కూడా ఒక ముఖ్య కారణమని వెల్లడించారు. హీరోల డేట్స్ అందుబాటులో లేకపోవడం వల్ల కూడా మార్పులు జరగవచ్చని వివరించారు. మొత్తానికి, సినిమా అవుట్‌పుట్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉత్తమ ఫలితం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వేణు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'ఎల్లమ్మ' సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి.

# రామ్ చరణ్ కంటి దగ్గర గాయం.. ఫోటో వైరల్!



**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గాయపడిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులను ఆందోళనకు గురిచేసిన ఈ ఘటనపై క్లారిటీ వచ్చింది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న చరణ్, ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానాతో 'పెద్ది' సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల 'పెద్ది' షూటింగ్ సందర్భంగా యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా ప్రమాదం జరిగింది. డూప్ లేకుండా స్టంట్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో చరణ్ కంటి పైభాగంలో గాయం అయింది. వెంటనే చిత్రబృందం చికిత్స అందించగా, వైద్యులు నాలుగు కుట్లు వేశారు. ఈ వార్త బయటకు రావడంతో అభిమానులు తీవ్రంగా ఆందోళన చెందారు. అయితే ఇది పెద్ద ప్రమాదం కాదని, చరణ్ పూర్తిగా సురక్షితంగా ఉన్నారని మూవీ యూనిట్ స్పష్టం చేసింది. గాయం అయినప్పటికీ చరణ్ తన డెడికేషన్‌ను చూపించాడు. డాక్టర్లు విశ్రాంతి సూచించినా, మరుసటి రోజే షూటింగ్‌కు హాజరయ్యాడు. కంటిపై కట్టుతోనే షూటింగ్‌లో పాల్గొనడం ఆయన కమిట్‌మెంట్‌కు నిదర్శనం. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫోటోలో చరణ్ రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. కంటి దగ్గర గాయం స్పష్టంగా కనిపించినా, ముఖంపై చిరునవ్వుతో అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. త్వరలోనే పూర్తిగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం.

# స్వతంత్ర బాబు గా నరేష్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ సీనియర్ నటుడు వీకే నరేష్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగపురం' నుంచి తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో నరేష్ 'స్వతంత్ర బాబు' అనే విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. జీవితాన్ని తనదైన శైలిలో ఆస్వాదిస్తూ, ఎలాంటి నియమాలకు బంధించకుండా జీవించే స్వేచ్ఛాయుత వ్యక్తిత్వంతో ఈ పాత్రను మలిచినట్లు చిత్రబృందం తెలిపింది. ఫస్ట్ లుక్‌లో నరేష్ లుక్, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ఈ పాత్రపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి 'ఆర్ ఎక్స్ 100' దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన సినిమాల్లో కనిపించే బలమైన భావోద్వేగాలు, విభిన్న పాత్రల మేళవింపు ఈ చిత్రంలో కూడా ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073